సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 21 । మార్చి । 2025



వేలంపాటలో ఉద్రిక్తత

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఏక పక్షంగా వేలంపాట ఎలా నిర్వహిస్తారంటూ కొందరు అధికారులను ప్రశ్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహార్ శని॥ (ఉ॥)
రాయచోటి	6.30	4.57
రాజంపేట	6.28	5.05
పీలేరు	6.30	4.57
మదనపల్లె	6.32	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 108 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

గడువు పొడిగింపు

నందలూరు: జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు) 5వ, 6వ తరగతులు, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గడువును మార్చి 15 నుంచి మార్చి 25వ తేది వరకు పొడిగించారు.ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ నాగేశ్వరి గురువారం తెలిపారు. ఔత్సాహికులు mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో ఖాళీలను చూసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నందలూరు పాఠశాల, కళాశాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, ఉచిత కంప్యూటర్ విద్య, లైబ్రరీ, ల్యాబ్స్, క్రీడా ప్రాంగణం వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

సకాలంలో రుణాల వసూలుకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి గురుప్రకాష్

రాయచోటి అర్బన్: రైతులకు మంజూరు చేసిన వివిధ రకాల రుణాలను సకాలంలో తిరిగి వసూలు చేసేలా సహకార సంఘాల ద్వారా సీఈఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి గురుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులకు (సీఈఓ) రాయచోటిలో ఉన్న మెప్మా కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సీఈఓలు తమ సంఘాల్లో వాయిదా మీరిన రుణాలను గుర్తించి బకాయిలను వెంటనే వసూలు చేయడం ద్వారా సంఘాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. జిల్లాలోని 901 సహకార పరపతి సంఘాలలో రికార్డుల కంప్యూటరీకరణ కార్యక్రమం పూర్తయిందని చెప్పారు. ప్రొద్దుటూరు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, సహకారసంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

24న గోవిందమాంబ ఆరాధన

బ్రహ్మంగారిమఠం: భవిష్యత్ కాలజ్ఞాన ప్రభోద కర్త శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన ఈనెల 24న నిర్వహిస్తునట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఉదయ 5 గంటలకు సుప్రభాత సేవ, 8గంటలకు అభిషేకం, 10గంటలకు సహస్ర నామార్చన, 1గంటకు ద్వారపూజ, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హుండీల ఆదాయం లెక్కింపు



బి.మఠంలో కానుకలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను గురువారం లెక్కించారు. ఇందులో రూ 20, 15,750 నగదు, 1గ్రామం బంగారం, 90గ్రాములు వెండి వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ , పూర్వపు మఠాధిపతి కుమారుడు వెంకటాద్రి స్వామి, ఎండోమెంట్ అధికారులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రాల పరిశీలన



అధికారులతో కలిసి పాఠశాలను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ మధుసూధన్

రాయచోటి టౌన్: పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం చేపట్టనున్న స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్ మ. ధుసూదన్ పరిశీలించారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంతో కలిసి సందర్శించారు. పరీక్షల అనంతరం స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులపై జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, డిప్యూటీ విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి, జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరాజులతో కలిసి చర్చించారు. ముఖ్యంగా స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రాల్లో గాలి, వెలుతురు తోపాటు భద్రతా ఏర్పాట్లు తనిఖీ చేశారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

పశువైద్యం.. దైవాధీనం

- మొదటి విడతలో వచ్చిన సంచార పశు వైద్య వాహనాలు నిలుపుదల
- మూగజీవాలకు కష్టకాలం

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో 108, 104 తరహాలో వైఎస్సార్‌సీపీ సర్కార్ వినూత్నంగా ఆలోచించి గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు అత్యుత్తమైన వైద్య సేవలు అందించేలా ప్రణాళిక అమలు చేసింది.ఎక్కడికక్కడ పశువులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు 2022 మే 19వ తేదీన సంచార పశు వైద్య వాహనాలకు శ్రీకారం చుట్టింది.సమున్నత లక్ష్యంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచార వాహనాలతో ఉత్తమ వైద్యానికి చర్యలు చేపట్టారు. అప్పట్లోనే ప్రతి నియోజకవర్గానికి ఒక వాహనాన్ని కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరంతరాయంగా పశువులకు సేవలు అందిస్తూ వచ్చిన సంచార వైద్యానికి గ్రహణం పట్టుకుంది. ప్రస్తుత కూటమి సర్కార్ సంచార పశు వైద్య వాహనాల గురించి పట్టించుకోకపోవడంతో దాదాపు మూడు వారాలుగా ఇవి మూలకు చేరాయి. కాంట్రాక్టు గడువు ముగియడంతో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు వాటిని నిలిపివేశారు.



పశువులకు వైద్య సేవలు అందించే సంచార పశు వైద్య వాహనం



కాంట్రాక్టు గడువు ముగిసినా..

ఉన్నతాశయంతో వైఎస్ జగన్ సర్కార్ పశు సంచార వాహనాలకు శ్రీకారం చుడితే గడువుముగియడంతో పక్కన పెట్టేశారు. అయితే కూటమి సర్కార్ కాంట్రాక్టు ముగిసినా పట్టించుకోకుండా ముందుకు వెళు తుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంత పశువులకు, ఇతర జంతువులకు ఉపయోగపడే ఈ పథకంపై ప్రస్తుత సర్కార్ నిర్లక్ష్యం చూపడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఏది ఏమైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంచార పశు వైద్య వాహనాల కాంట్రాక్టు పొడిగించడంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో అంతుచిక్కడం లేదని పలువురు పశువుల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

పశు యజమానులకు కష్టకాలం

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో లక్షల సంఖ్యలో కోళ్లు, గేదెలు, ఆవులు, ఎద్దులు, ఇతర పెంపుడు జంతువులు ఉన్నాయి. అయితే సంచార పశు వైద్య వాహనం ద్వారా ఎక్కడికక్కడ సమస్య ఉన్నచోటనే...జంతువును వాహనంలోకి హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఎక్కించి అక్కడే అన్ని పరీక్షలు చేసేవారు. పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను కూడా సంచార వాహనంలో అందుబాటులో ఉంచారు. అత్యున్నత టెక్నాలజీతో వాహనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అయితే దీనికి 108, 104 తరహాలోనే ఒక నంబరును కేటాయించి ఫోన్ చేయగానే గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో 6, వైఎస్సార్ జిల్లాలో 7 వాహనాలు తిరగడకపోవడంతో రెండోదశలో వచ్చిన వాహనాలతోనే వైద్యం అందిస్తున్నారు. దీంతో పశువులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం గగనంగా మారింది. ఎందుకంటే కొన్ని వాహనాలు పక్కన పెట్టడంతో మిగిలినవి పరిమిత సంఖ్యలోనే వైద్యం అందిస్తాయి. దీంతో పాడి రైతులకు సమస్యలు తప్పడం లేదు.

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని పశువుల సమాచారం

	వైఎస్సార్ జిల్లా	అన్నమయ్య జిల్లా
గేదెలు	3,99,854	100588
కోళ్లు	31,82,190	30,82,260
ఎద్దులు, ఆవులు	44,000	276417
గొర్రెలు	9,20,614	18,24,325
మేకలు	3,80,099	3,53,370
జిల్లాలో పాడి రైతులు	1.80 లక్షలు	2 లక్షలు

వాహనాలను పనురుద్ధరించాలి



గత ప్రభుత్వ హయాంలో సంచార వైద్యశాలలు ఉండేవి. వాటి ద్వారా పశువులకు ఇంటివద్దనే వైద్యం అందేది. నేడు ఆ వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూగజీవాల ఆరోగ్యంగా దెబ్బతింటే ఆటోల ద్వారా సమీప పశువైద్య శాలకు తరలించి చికిత్స అందిస్తున్నాం. ఇలా చేయడం కష్టంతో కూడుకున్న పని, ఆర్థికంగా ఇబ్బంది. ప్రభుత్వం తక్షణమే సంచార పశువైద్య వాహనాలను పనురుద్ధరించాలి.

–సుబ్బరాయుడు,రైతు పాళెంగడ్డ,సంబేపల్లె మండలం

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

అన్నమయ్య జిల్లాలో పశుసంవర్ధకశాఖలో మొదటి విడతలో వచ్చిన ఆరు సంచార పశు వైద్య వాహనాల గడువు మీరడంతో పక్కన పెట్టారు. అయితే రెండో విడతలో వచ్చిన వాహనాలతో పశు యజమానులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఎప్పటికప్పుడు పాడి రైతులతోపాటు మిగిలిన ప్రాంతాల్లోనూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

–గుణశేఖర్‌పిళ్లై, పశు సంవర్ధకశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

జిల్లాలో భారీగా పోలీసుల బదిలీ

- నేడు మధ్యాహ్నం లోపు విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశం

రాయచోటి: జిల్లా పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నడుం బిగించారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి భారీ స్థాయిలో పోలీసులన బదిలీ చేస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 41 మంది ఏఎస్ఐలు, 123 మంది హెడ్ కానిస్టేబుళ్లకు స్థానచలం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే మరో 230 మంది కానిస్టేబుళ్లను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులను సిద్ధం చేసినట్లు సమాచారం. పాలన సౌలభ్యంలో భాగంగా జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందిని మార్పు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ఎస్పీ పేర్కొన్నారు. రాజకీయాలకు అవకాశం లేకుండా.. పారదర్శకంగా బదిలీలను చేపట్టామన్నారు. బాధ్యతలు చేపట్టిన సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించినట్లు తెలియ వచ్చింది. బదిలీ అయిన ప్రతి ఒక్కరు శుక్రవారం మధ్యాహ్నం లోగా వారికి కేటాయించిన స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

అధికారులకు పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్: రాయలసీమ జోన్–4లో సీనియర్ అకౌంటెంట్లుగా పనిచేస్తున్న 11 మందికి అడ్‌హాక్ బేసిస్‌పై సబ్ ట్రెజరీ అధికారులుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఎస్.మోహన్‌రావు గురువారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాయచోటి డీటీగా పనిచేస్తున్న వి. లక్ష్మీనారాయణ రాజంపేటకు, సిద్దవటం ఎస్టీగా పని చేస్తున్న ఆర్. యానాదయ్య కడపకు, పుట్టపర్తి డీటీగా పనిచేస్తున్న జి.రామాంజనేయులు రాయచోటికి, అనంతపురం డీటీ కె.జాన్ కృపాకర్ మదనపల్లెకు, ప్రొద్దుటూరులో ఎస్టీగా విధులు నిర్వహిస్తున్న బి.ప్రమీలాదేవి వాయల్పాడుకు, కడప డీటీ ఆర్.బాబక్క తంబళ్లపల్లెకు బదిలీ అయ్యారు.

పుణ్యఫలాల శుభ రాత్రులు

- నేటి నుంచి తాఖ్ రాత్రులు
- ప్రత్యేక ఏర్పాట్లలో మసీదు నిర్వాహకులు



మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్ మాసం చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ మాసమంతా మహిమతో కూడినదిగా భావిస్తారు. ఇందులో మొదటి రోజులు అల్లాహ్ కరుణ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తే...రెండవ పది రోజుల్లో తమ తప్పులను క్షమించాలని ప్రార్థిస్తారు. ఇక మూడవదైన ముఖ్యమైన చివరి పదిరోజులు మొదటి రెండు విభాగాల కంటే కొంచెం భిన్నమైనవిగా భావిస్తారు. నరకం నుంచి బయట పడేయాలని అల్లాహ్‌ను శరణు కోరుకునేందుకు ఈ పదిరోజులను ప్రత్యేకమైనవిగా భావిస్తారు. రంజాన్‌మాస చివరి పది రోజుల్లో పవిత్ర బడీరాత్ వస్తుంది. దీన్నే షబ్ ఏ ఖదర్ లేదా లైలతుల్ ఖద్ర్ అనికూడా అంటారు. ఈ పవిత్ర రాత్రి చివరి పది రోజుల్లో బేసి రాత్రుల్లో ఉంటుందన్న నమ్మకంతో ముస్లింలు తాఖ్ రాత్‌గా నిర్వహిస్తారు. మరీ ముఖ్యంగా 27వ రోజు రాత్రే లైలతుల్ ఖద్ర్ ఉంటుందని భక్తుల విశ్వాసం. లైలతుల్ ఖద్ర్ రాత్రి జాగరణ చేసి ప్రార్థనలు చేయడంతో వెయ్యి నెలలపాటు ఉపవాస దీక్షలు చేసినంత ఫలం లభిస్తుందని పెద్దలు పేర్కొంటున్నారు. ప్రజల పాపాలను క్షమించాలని కోరుతూ మహమ్మద్ ప్రవక్త ప్రార్థించారని పవిత్ర ఖురాన్ గ్రంథంలో ఉండడంతో ముస్లింలు జాగరణ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

- పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత ముఖ్యమైనవిగా, అధిక పుణ్యాన్ని ఇచ్చే తాఖ్ రాత్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేట, పీలేరు, రైల్వేకోడూరు, వాల్మీకిపురం, పలు మండల కేంద్రాల్లోని మసీదులలో నిర్వాహకులు ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వక్తలు, గురువులు తాఖ్ రాత్‌లలో అల్లాహ్ సందేశాన్ని అందజేసేందుకు రానున్నారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల నుంచి మొదటి తాఖ్ రాత్‌ను ఆచరించనున్నారు. ఆ తర్వాత రోజు విడిచి అంటే ఈనెల 23, 25, 27, 29 తేదీలలో తాక్‌ఖాత్‌లను ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఐదు రోజులపాటు తరావీ నమాజు అనంతరం పవిత్ర ఖురాన్ పఠనం తోపాటు సామూహికంగా జిక్ర్‌ను చేయించనున్నారు. అలాగే అర్ధరాత్రి తహజుద్ ప్రార్థనలకువిశేష ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల అనంతరం ఐదు రోజులపాటు ఉపవాస దీక్ష చేపట్టే వారికి సెహరి సౌకర్యం కల్పించనున్నారు. దీంతోపాటు శుక్రవారం ముస్లిం భక్తులు మసీదులలో ఎత్తేకాఫ్ (తపోనిష్ఠ) దీక్షలు పాటిస్తారు. వీరు రోజంతా పూర్తిగా ఇతర విషయాల జోలికి వెళ్లకుండా కేవలం ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. రంజాన్ పండుగ నిర్వహణకు సూచనగా నెలవంక కనిపించిన తర్వాతనే వారు దీక్ష విరమిస్తారు.



మదనపల్లెలోని జామియా మసీదు

ఖురాన్ పఠించాలి



రంజాన్ మాసంలోని చివరి పది రోజులను తాక్ రాత్రులు అంటాం. 21,23, 25,27,29 ఏదైనా ఓ రాత్రి పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ దివి నుంచి భూమిపైకి అవతరిస్తుందని అనేక హదీసులలో, ఖురాన్‌లో పేర్కొన్నారు. ఈ రాత్రులు ఎంతో మహిమ గలవి. ప్రతి ముస్లింలు ఈ రాత్రుల్లో దివ్య ఖురాన్ పఠించాలి. ప్రత్యేక నమాజులు ఆచరించాలి.

– ఇక్బాల్ అహ్మద్, మత గురువు మదనపల్లి

కురబలకోట పీఠంపై

బీసీ మహిళ

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నిర్ణయం
- ఎంపీటీసీల ఏకగ్రీవ తీర్మానం
- ఇకపై ఐదుగురు ఎంపీపీలు మహిళలే

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో మరో బీసీ మహిళ ఎంపీపీ పీఠంపై కూర్చోనుంది. బీసీ జనరల్ ఎంపీపీ స్థానమైన కురబలకోట ఎంపీపీగా బీసీ మహిళను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎంపిక చేయగా గురువారం ఎంపీటీసీ సభ్యులు సమావేశమై నందిరెడ్డిగారిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ అయిన ఎంజీ.భూదేవిని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఏవో నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ దస్తగిరిసాబ్ ఆరోగ్య కారణాలతో ఆరునెలల పాటు సెలవులో వెళ్లారు. అప్పటిదాకా ఎంపీపీగా ఒకరు బాధ్యతలను పూర్తిస్థాయిలో చేపట్టి మండల పరిషత్ పాలన సాగించాల్సి ఉంటుంది. దీనికి మొదటి వైస్ ఎంపీపీ ఎన్.వెంకటరమణారెడ్డి ఎంపీపీగా విముఖత చూపారు. రెండో వైస్ ఎంపీపీ భూదేవికి అవకాశం కల్పించారు. మండలంలోని 12 మంది ఎంపీటీసీల్లో ఒకరు స్వతంత్ర అభ్యర్థికాగా మిగిలిన 11 మందిలో ఇద్దరు అరోగ్య కారణాలతో హాజరుకాలేదు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఎం .త్రివేణి, ఎంజీ.భూదేవి, ఆర్.రవీంద్రారెడ్డి, ఎం.ఆనందరెడ్డి, ఎస్.వెంకటరమణారెడ్డి, డి.నిర్మలమ్మ, వి.గోపాలకృష్ణ, జి.సుశీలమ్మ, జి.సరస్వతమ్మ హాజరయ్యారు. తదుపరి ఎంపీపీగా భూదేవి పేరును ఆనందరెడ్డి ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. తర్వాత వినతిపత్రాన్ని ఏవోకు అందజేసి తర్వాతి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు విశ్వారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఫిరోజ్ ఖాన్, కృష్ణారెడ్డి, టీఏసీ సభ్యులు దామోదర్ రెడ్డి, కోళ్ల వాసుదేవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ బీసీ మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి రుణపడి ఉంటామని అన్నారు.




ఎంపీపీ ఎన్నికపై ఏవోకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

జనరల్ స్థానాల్లో బీసీలు: గత ఎంపీటీసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 72 ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ స్థానాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బీసీ నేతలకు అవకాశం కల్పించారు. 7 ఎంపీటీసీ సీట్లను బీసీలకే అదనంగా కేటాయించి జనరల్ స్థానాల్లో అభ్య ర్థులుగా పోటీచేయించారు. బి.కొత్తకోట మండలంలోని తుమ్మనగుట్ట ఎంపీటీసీ స్థానం జనరల్ కాగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఖాదర్‌వలీని ఎంపీటీసీ అయ్యాక వైస్‌ఎంపీపీ చేశారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని పట్టెంవాండ్లపల్లె-2 స్థానం జనరల్ కాగా బీసీ-బీ వర్గానికి చెందిన పి.శోభకు టికెట్ ఇచ్చి గెలిపించారు. పెద్దతిప్పసముద్రం-2 ఎంపీటీసీ స్థానం జనరల్‌లో బీసీ వర్గానికి చెందిన జి.మహమ్మద్‌కు టికెట్ ఇచ్చారు. ఆయన్నే పీటీఎం ఎంపీపీ చేశారు. తంబళ్లపల్లె మండలంలోని ఎద్దులవారిపల్లెకు ఎంపీటీసీ స్థానం జనరల్ కాగా బీసీ వర్గానికి చెందిన సీజీ.హరితకు అవకాశం ఇచ్చారు. కోటాల జనరల్ స్థానంలో బీసీ అయిన చిన్న రామకష్ణకు సీటిచ్చారు. పెద్దమండ్యం మండలంలోని ఎన్.ఓ. పల్లె ఎంపీటీసీ స్థానం జనరల్ కాగా బీసీ మహిళ జి.చంద్రకళకు అవకాశం ఇచ్చి తర్వాత ఎంపీపీ చేశారు. కోటాకాడపల్లె ఎంపీటీసీ జనరల్ స్థానంలో బీసీ-బీ వర్గానికి చెందిన బి.రవితేజకు అవకాశం కల్పించారు. వీరందరూ విజయం సాధించారు.

ఐదుగురు మహిళలే...

కురబలకోట ఎంపీపీగా భూదేవి బాధ్యతలు చేపడితే నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఐదుగురు మహిళలే ఎంపీపీలు అవుతారు. ఇప్పటికే పెద్దమండ్యం, ములకలచెరువు ఎంపీపీలు బీసీ మహిళలు, బి.కొత్తకోట ఎస్సీ మహిళ, తంబళ్లపల్లె జనరల్ మహిళ, ఇప్పుడు కురబలకోట ఎంపీపీగా భూదేవి బీసీ మహిళ అవుతారు. పెద్దతిప్పసముద్రం ఎంపీపీ మొహమూద్ బీసీ. దీంతో బీసీ ఎంపీపీల సంఖ్య నాలుగుకు చేరుతుంది.

బీసీలు ఎదగాలి



వెనుబడిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం రాజకీయాల్లో ఎదగాలి. బీసీల అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యత మాటల్లో కాక చేతల్లో చూపించాం. అందుకనే కురబలకోట ఎంపీపీగా బీసీ మహిళకు మద్దతు ఇచ్చాం. అన్ని పార్టీలు బీసీల రాజకీయ అభ్యున్నతికి అండగా నిలవాలి.

–పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఏనుగు దాడిలో మృతుల కుటుంబాలకు సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ముక్కా వరలక్ష్మీ

ఓబులవారిపల్లె : శివరాత్రి సందర్భంగా తల కోనకు కాలినడకన వెళ్తూ వై.కోట సమీపంలో ఏనుగల దాడిలో మృతిచెందిన కుటుంబాలకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ముక్కా వరలక్ష్మీ గురువారం ఆర్థికసాయం అందజేశారు. రైల్వేకోడూరు మండలం బుడుగుంటపల్లి పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన మృతురాలు తుపాకుల మణెమ్మ, తిరుపతి చెంగల్ రాయుడు, ఉర్లగడ్డపోడు వంకాయల దినేష్ కుమార్ కుటుంబీకులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చెక్కులను ముక్కా వరలక్ష్మీ అందజేశారు. ముక్కా వరలక్ష్మీ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



రాజంపేట టౌన్ : పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఓ లారీ గురువారం డివైడర్‌పైకి దూసుకెళ్లింది. అదుపుతప్పి కింద పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కడప–తిరుపతి మార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. బైపాస్ రోడ్డు కావడంతో వేగంగా వెళ్తుంటాయి. లారీ కింద పడి ఉంటే వెనుకవైపు వచ్చే వాహనాలు ఢీకొని పెనుప్రమాదం జరిగేదని, ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. డివైడర్ ఎత్తు పెంచాలని వాహనదారులు కోరారు.

ఇసుక రవాణాకు అడ్డుకట్ట



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వీరబల్లి : మండలంలోని పెద్దవీటి పంచాయతీ ఎలకచెట్టుపల్లి వంతెన, రాగిమాను దిన్నెపల్లి వద్ద మాండవ్య నదిలో ట్రాక్టర్లతో నిత్యం ఇసుక తరలిస్తున్నారు. ఇసుక రవాణా ట్రాక్టర్లను నదిలోకి వెళ్లనీయకుండా రాగిమానుపల్లి గ్రామస్తులు గురువారం నిలిపివేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు నాయకుల సహకారంతో ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి తాగడానికి నీరు దొరకకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు వెంకటేష్‌కు ఫోన్ ద్వారా తెలుపగా ఇసుక రవాణాను నిలిపవేయాలని సిబ్బందికి సూచించారు.

అటవీ భూమి కబ్జా



అటవీ భూమిలో జేసీబీతో పనులు

చిన్నమండెం : మండలంలో ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారు. చిన్నర్సుపల్లె కొండ కింద కింద ఉన్న అటవీ భూమిని జేసీబీతో చదును చేయిస్తున్నా.. స్థానికులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. వివరాల్లోకి వెళితే.. చిన్నమండెం మండలం చాకిబండ చెరువు వద్ద చిన్నర్సుపల్లె కొండ కింద అటవీ భూమి ఉంది. మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వారం రోజులుగా యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడుతున్నా అటవీ అధికారులు స్పందించడం లేదు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

వేలంపాటలో ఉద్రిక్తత

- డీఎల్పీవో, సర్పంచ్ గైర్హాజరుతో వాయిదా
- ఎస్ఐలు, పోలీసుల భారీ బందోబస్తు
- ఈవోఆర్డీపై రెండు గ్రామాల ప్రజల ఆగ్రహం



ఈవోఆర్డీని నిలదీస్తున్న ప్రజలు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఏక పక్షంగా వేలంపాట ఎలా నిర్వహిస్తారంటూ కొందరు అధికారులను ప్రశ్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే మంతనాల అనంతరం ఈవోఆర్డీ స్పందించి సర్పంచ్, డీఎల్పీవో హాజరు కానందున వాయిదా వేస్తున్నామని చెప్పడంలో పాటదారులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని రంగసముద్రం చెరువులో చేపల పెంపకంపై స్థానిక రాపూరివాండ్లపల్లి సచివాలయం ఎదుట గురువారం వేలంపాట నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఒక రోజు ముందు మాత్రమే చాటింపు వేయడం, ఆశావహులకు డిపాజిట్లు చెల్లింపునకు ఒక రోజు గడువు ఇవ్వడంతో పాటదారుల్లో అసహనం, అనుమానాలు రేకెత్తాయి. దీంతో వివాదం తలెత్తకుండా అధికారులు పోలీసుల రక్షణ కోరారు. పీటీఎం, ములకలచెరువు ఎస్ఐలు హరిహరప్రసాద్, నరసింహుడు, 5 మంది పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు చేపట్టారు.

వాయిదా వేశామన్న అధికారులు

ధరావతు చెల్లించిన వారు మాత్రమే లోనికి రావాలని చెప్పడంతో గందరగోళం నెలకొంది. వేలం బహిరంగంగా కాకుండా కార్యాలయం లోపల గుట్టుగా వేయడం వెనుక ఆంతర్యం ఏమనే జనం అనుమానాలు వ్యక్తం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 12 గంటలైనా స్థానిక సర్పంచ్, డీఎల్పీవో వేలం పాటకు గైర్హాజరవడం ఇందుకు బలం చేకూర్చింది. దీంతో సచివాలయంలోకి వెళ్ళేందుకు పలువురు గ్రామస్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రజల సూచన మేరకు ఇన్‌చార్జి ఈవోఆర్డీ మోహన్ ప్రతాప్‌ను బయటకు రప్పించగా.. నిబంధనలకు విరుద్ధంగా వేలంపాట ఎలా నిర్వహిస్తారు? వేలంలో పాల్గొనే వారు అధికంగా ఉన్నా డిపాజిట్ కట్టించుకునేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? మీకు నచ్చిన వాళ్ళ దగ్గరే డబ్బు కట్టించుకుంటారా? అంటూ స్థానికులు గట్టిగా నిలదీసారు. ఎట్టకేలకు స్పందించిన ఈవోఆర్డీ స్పందిస్తూ సర్పంచ్, డీఎల్పీవో హాజరు కానందున వేలంపాట వాయిదా వేస్తున్నామని తెలిపారు. లోపాలు సరిదిద్ది, ముందస్తుగా చాటింపు, కర పత్రాలు, పత్రికల్లో ప్రకటనల ద్వారా ప్రచారం చేసి వేలం నిర్వహిస్తామని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి



మౌలా (ఫైల్)



గాయపడిన శ్రీనివాసులు

మదనపల్లె : ద్విచక్ర వాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని సాయిబులవారిపల్లెకు చెందిన హుస్సేన్, ఖాదర్‌బీ దంపతుల కుమారుడు షేక్‌మౌలా(25) అంగళ్లు చికెన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతడికి భార్య సాదియా, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో ఇంటి నుంచి వస్తున్నారు. సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు శ్రీనివాసులు (26) ముదివేడు జాతరకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ముదివేడు క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న ఇరువురి వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో మౌలా తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. శ్రీనివాసులు సైతం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మౌలా మృతిచెందగా, శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలానికి 108 అంబులెన్స్ వాహనం గంట వరకు రాకపోవడంపై మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో గాయపడిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబీకుల రాస్తారోకో

మౌలా మృతికి కారణం మదనపల్లె జిల్లా ఆసుపత్రి డాక్టర్లే కారణమని ఆతడి బంధు మిత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ఆసుపత్రికి తరలించినా ఆసుపత్రిలో టెక్నీషియన్ లేకపోవడం, మెరుగైన వైద్యం అందించకపోవడంతోనే మౌలా చనిపోయారని ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆసుపత్రి బయట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

నందలూరు : మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, న్యూస్ ఐటమ్ రాసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజంపేట రూరల్ సీఐ బీవీ.రమణ అన్నారు. రాజంపేట ఆర్టీసీ బస్సులో నందలూరుకు చెందిన ఇద్దరు ముస్లిం మహిళలు తమ పిల్లలతో కడపలో బస్సు ఎక్కారన్నారు. మూడు ఫుల్ టిక్కెట్స్, ఒక ఆఫ్ టిక్కెట్ ఇవ్వాలని బస్ కండక్టరును అడిగారన్నారు. టికెట్ ఇవ్వగానే రూ.500 నోటు ఇవ్వగా, క్యాష్ బ్యాగ్‌లో కాకుండా ఫ్యాంట్ జేబులో పెట్టుకున్నాడన్నారు. ఆ తర్వాత ముస్లిం మహిళ మిగతా చిల్లర ఇవ్వాలని అడగ్గా.. మళ్లీ ఇస్తానని చెప్పారన్నారు. బస్సు ఒంటిమిట్టకు చేరుకున్న తర్వాత కండక్టర్‌ను మళ్లీ చిల్లర ఇవ్వాలని ఆ మహిళ అడగ్గా, నువ్వు ఇచ్చింది రూ.200, రూ.500 కాదని కండక్టర్ వాగ్వాదం చేశారన్నారు. అంతటితో ఆగకుండా నువ్వు ఏమైనా తాగి వచ్చి మాట్లాడుతున్నావా అంటూ ఆ మహిళను కండక్టర్ హేళనగా మాట్లాడాడన్నారు. అతడి ప్రవర్తనపై ఆమె 100కు డయల్ చేసి డ్రైవర్‌తో ఫోన్‌లో మాట్లాడించిందన్నారు. కండక్టర్ మాటలను ముస్లిం మహిళ అవమానంగా భావించి తమవారికి ఫోన్ చేసి చెప్పిందని, దీంతో ఆమె బంధువులు బస్టాండుకు వచ్చి కండక్టర్‌పై దాడి చేశారన్నారు. స్థానికులు సర్దిచెప్పి.. కండక్టర్‌తో సారీ చెప్పించారన్నారు. ఇరువర్గాల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారిస్తామని తెలిపారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

కలసపాడు : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంట్ పటిష్టమైనదని భారతీ సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్లు శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో గురువారం బిల్డర్లు, మేస్త్రీలకు సిమెంటు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారతి సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతోందన్నారు. అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందని, ఇతర కంపెనీల సిమెంట్‌కు ఐదు గంటలు పడితే భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ రెండు గంటల్లోనే గట్టి పడుతుందన్నారు. చాలా దృఢత్వాన్ని కలిగి కట్టడాలు త్వరగా పూర్తవుతాయని తెలిపారు.

అనంతరం వంద మంది మేస్త్రీలకు రూ.లక్ష విలువ గల ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో డీలర్ వెంకటసుబ్బయ్య, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

వెలిగల్లు శుద్ధి జలాలను సద్వినియోగం చేసుకోవాలి

– జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

గాలివీడు : వెలిగల్లు శుద్ధి జలాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ ఓబులమ్మ కోరారు. మండలంలోని వెలిగల్లు జలాశయం వద్ద వివిధ దశల్లో జరుగుతున్న నీటి శుద్ధి ప్రక్రియ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణకుమార్, అధికారులతో ఆమె సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ వెలిగల్లు జలాశయం నుంచి వెలువడే నీరు శుద్ధి చేసిన అనంతరం స్వచ్ఛంగా ఉన్నాయని, అవగాహనా రాహిత్యంతో వృథా చేయడం సరికాదన్నారు. రానున్న వేసవి దష్ట్యా ప్రజలు ప్రతి నీటి బొట్టు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా స్కీం బోర్లలో సమస్యలు తలెత్తున్నాయా అనే విషయంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్‌బాబు, లక్కిరెడ్డిపల్లి డీఈ విద్య, జేఈ ప్రదీప్, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వరాహానికి ఏనుగు లాంటి పిల్ల జననం



ఒంటిమిట్ట : మండలంలోని పెద్దకొత్తపల్లిలో ఓ వరాహానికి ఏనుగు లాంటి పందిపిల్ల జన్మించింది. గ్రామస్థుల వివరాల మేరకు.. మూడు రోజుల కిందట పెద్దకొత్తపల్లిలో ఓ వరాహానికి తొమ్మిది పిల్లలు జన్మించాయి. అందులో ఎనిమిది పంది పిల్లలు ఒకలా ఉంటే, ఒకటి మాత్రం ఏనుగు తొండాన్ని వేసుకొని విచిత్రంగా ఉంది. దీంతో పోతులూరి వీరబ్రహ్మం చెప్పిన మాటలు నిజమవుతున్నాయంటూ గ్రామంలో చర్చ మొదలైంది. కొందరు పంది పిల్లను చూసేందుకు ఎగబడ్డారు. బుధవారం ఆ పందిపిల్ల మృతి చెందడంతో హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేశారు.

పక్కా గృహాల నిర్మాణం వేగవంతం

– హౌసింగ్ పీడీ సాంబశివయ్య



సూచనలిస్తున్న పీడీ సాంబశివయ్య

గాలివీడు : 2019–24 మధ్యకాలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య కోరారు. మండలంలోని వెలిగల్లు ఎస్సీ ,ఎస్టీ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు ప్రభుత్వం రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు మొత్తం మంజూరు చేస్తోందని, వెంటనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. పనులు మొదలుపెట్టిన వెంటనే బిల్లులు ఇస్తారన్నారు. అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ బుక్కే రమేష్‌నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

క్యాస్ట్ సర్టిఫికేట్ కరెక్షన్‌కు ఆరు నెలలు



న్యాయం చేయాలంటున్న బాధితుడు హబీబ్‌సాహెబ్

మదనపల్లె : కుమారుడి చదువు కోసం క్యాస్ట్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే.. తప్పుల సవరణ పేరుతో ఆరు నెలలుగా పత్రం ఇవ్వకుండా నిలిపివేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు హబీబ్ సాహెబ్ వివరాల మేరకు.. నిమ్మనపల్లె కందూరు రోడ్డుకు చెందిన బి.హబీబ్ సాహెబ్ షేక్(బీసీ–ఈ) కులానికి చెందిన వ్యక్తి. ఇతడికి బి.ఫహీమ్, బి.ఫాజిల్లా, బి.ఫరీద్ సాహెబ్ ముగ్గురు పిల్లలు. ఫరీద్ సాహెబ్ ఐదో తరగతి చదువు తున్నారు. నవోదయ విద్యాలయలో చేర్పించేందుకు క్యాస్ట్ సర్టిఫికెట్ అవసరమవడంతో దరఖాస్తు చేసుకుని కావాల్సిన ధృవ పత్రాలు జతపరిచాడు. నిమ్మనపల్లె రెవెన్యూ సిబ్బంది బీసీ–ఇకు బదులుగా ఇండియన్ ముస్లిం(ఓసీ)గా పేర్కొంటూ జారీ చేశారు. దీంతో హబీబ్, తాము షేక్(బీసీ–ఈ)కు చెందిన వారమని, భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని రెవెన్యూ అధికారులకు విన్నవించారు. మిగిలిన తన ఇద్దరు కుమారుల క్యాస్ట్ సర్టిఫికెట్లు, ఫరీద్ అహ్మద్ స్కూల్ టీసీ చూపినా బీసీ–ఈ సర్టిఫికేట్ జారీ చేయడంలో అధికారులు జాప్యం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీ పంపి, క్యాస్ట్ సర్టిఫికెట్ సరిచేసేందుకు మూడు నెలలుగా నిమ్మనపల్లె తహసీల్దారు కార్యాలయం, మదనపల్లె సబ్ కలెక్టరేట్ చుట్టూ సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు మరోసారి ఫైల్ తెచ్చి ఇవ్వాల్సిందిగా కోరారన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదానికి ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

లక్కిరెడ్డిపల్లి : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. 2023–24లో జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోషల్ ఆడిట్ సభ నిర్వహించారు. తనిఖీల్లో ఎక్కువగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని 16 పంచాయతీలలో రూ.43,243, ఏపీడీ తనిఖీలో రూ.1,91,425 ఇప్పటి వరకూ రికవరీ చేశారని సిబ్బంది పీడీకి తెలిపారు. డీఆర్పీలు, ఉపాధి సిబ్బంది భారీ ముడుపులు తీసుకున్నారని తనిఖీ సిబ్బంది వెల్లడించారు. డ్వామా పీడీ ఆమట్లాడుతూ ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేశారని ఉపాధి సిబ్బందిపై మండిపడ్డారు. తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఒక్కొక్క పంచాయతీ నుంచి డిఆర్పీలకు ముడుపులు ముట్టినట్లు క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారన్నారు. ఈ విషయంపై వివరణ కోరుతూ ఈసీ వెంకటాలపతి, కంప్యూటర్ ఆపరేటర్ పవన్ నాయక్, టీఏ విజయదుర్గా, ప్రసాద్ రాఘవేంద్రలకు పీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీఓ జిల్లీ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్ షెడ్ ఏపీడీ లక్ష్మీ నరసయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఏపీడీఓ డిల్లీబాబు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో నెరవేరని సొంతింటి కల



ఇంటి స్థలాలివ్వాలంటూ ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, తదితరులు

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా పేదల సొంతింటి కల నెరవేరిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. పేదలకు ఇంటి పట్టాలు మంజూరుచేసి పక్కాఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇల్లు కట్టుకునేందుకు సాయం చేయాలని కోరారు. సర్వేల పేరుతో కాలక్షేపం చేయడం దారుణం అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తామంటూ చెప్పిన చంద్రబాబు హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్మిస్తున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎల్.నరసింహులు, ఎస్.శ్రీనివాసులు, సుమిత్ర, సాంబశివ, తోపు క్రిష్టప్ప, సుధీర్‌కుమార్, మనోహర్‌రెడ్డి, టీఎల్.వెంకటేష్, శివరామక్రిష్ణ దేవరా, కోటేశ్వరరావు, జ్యోతిచిన్నయ్య, వంగిమళ్ల రంగారెడ్డి, జక్కల వెంకటేష్, మాధవ్, మహిళలు పాల్గొన్నారు.

హద్దులు దాటిన.. డ్యాన్స్

- ముదివేడు తిరునాలలో రికార్డింగ్ డ్యాన్సులు
- ముగ్గిరిపై కేసు నమోదు...వాహనాలు సీజ్



ముదివేడు తిరునాలలో రికార్డింగ్ డ్యాన్సులు

కురబలకోట : ముదివేడు అమ్మవారి తిరునాలలో డ్యాన్స్ హద్దులు దాటింది. భక్తి భావం ఉప్పొంగాల్సిన చోట అసభ్యకర నృత్యంతో హోరెత్తించారు. కురబలకోట మండలం ముదివేడు దండుమారెమ్మ రాత్రి తిరునాల సందర్భంగా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించకూడదని ముందస్తుగా పోలీసులు హెచ్చరించినా కొందరు ఖాతరు చేయలేదు. మండలంలోని నడింపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో బుధవారం రాత్రి హద్దులు దాటి యథేచ్ఛగా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించారు. ఈ దృశ్యాలను కొందరు సెల్ ఫోన్‌లో రికార్డ్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకుని చాందినీబండి నిర్వాహకుడు నడింపల్లె అశోక్‌పై వివిధ సెక్షన్ల కింద నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ గురువారం తెలిపారు. వారు ఉపయోగించిన డీజే సౌండ్ సిస్టమ్, ఇతర వాహనాలను సీజ్ చేసి కందూరుకు చెందిన కార్తీక్, డిజే వెహికల్ డ్రైవర్ గురునాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిగులు భూములు పంపిణీ చేయాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ మిగులు భూములను పేద గిరిజనులు, దళితులను పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు క్రిష్టప్ప డిమాండ్ చేశారు. రాయచోటి జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొలకలచెరువు, గుడుపల్లె వద్ద గల 270 ఎకరాల చెన్నప్పగారిగడ్డ స్త్రోత్రియం భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఓబులవారిపల్లె మండలం వైకోట గ్రామం బాల్‌రెడ్డిగారిపల్లె వద్ద 200 ఎకరాలు, పుల్లంపేట మండలం రంగంపల్లె పంచాయతీ కయపాకురాజు పల్లె వద్ద వంద ఎకరాల భూములను అర్హులైన పేదలు సాగు చేసుకునేందుకు ఇవ్వాలని కోరారు. ఫ్రీహోల్డ్ కింద పెట్టడంతో దళితులు, గిరిజనులు నష్టపోతారని అన్నారు. కబ్జా కోరల్లో చిక్కుకున్న వాగులు, వంకలు, చెరువులు, కుంటలను కాపాడాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయరామయ్య, వినయ్, వెంకటరమణ, వెలుగురమణ, వెంకట నరసమ్మ, మల్లిక వెంకటరమణ, శంకర, మునికోటయ్య, రామప్ప పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



సిద్ధరామయ్య (ఫైల్)

పీలేరురూరల్ : ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. సీఐ యుగంధర్ కథనం మేరకు.. కాకులారంపల్లె పంచాయతీ కోళ్లఫారానికి చెందిన బెల్లం వెంకటేష్ కుమారుడు సిద్ధరామయ్య(36) ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద, గ్రామ పరిసరాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. రెండు రోజుల క్రితం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం గ్రామ సమీపంలోని గురుకుల పాఠశాల ప్రహరీ వద్ద విగతజీవిగా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ యుగంధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



నవీన్‌కుమార్ మృతదేహం

తంబళ్లపల్లె : ఓ యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ లోకేష్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు... గుండ్లపల్లి పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన పెద్దవీరభద్ర కుమారుడు నవీన్‌కుమార్(24) స్థానిక పుడమి కిసాన్ మార్ట్ ఎరువుల దుకాణంలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి పది గంటల వరకు షాపులో ఆడిట్ జరిగింది. అనంతరం షాపు మూసుకుని ఇంటికి చేరాడు. గురువారం ఉదయం 6.30 గంటలకే షాపుకు వచ్చి భవనం వెనుక మెట్ల వద్ద పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులు గమనించే సరికి మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తండ్రి పెద్దవీరభద్ర హుటాహుటిన సంఘటన స్థలం చేరుకుని బోరున విలపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడి మృతిపై పలు అనుమానాలున్నాయని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి తండ్రి పోలీసులను వేడుకున్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్.ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్తు షాక్

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న వలస కార్మికుడు
- లైన్‌మెన్, ఇద్దరు ఆపరేటర్లపై కేసు నమోదు



విద్యుత్ షాక్‌తో గాయపడిన మున్నాధావన్

ఒంటిమిట్ట : మండలంలోని సాలాబాద్ గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ వివరాల మేరకు.. సాలాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేస్తున్నారు. లైన్‌మెన్ జనార్ధన్‌రెడ్డి ఆదేశాలతో సాలాబాద్ 33/11 కె.వి.సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి ఎల్‌సీ ఇచ్చారు. అనంతరం బీహార్‌కు చెందిన రిడీ సాయి ఎలక్ట్రికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికుడు మున్నాధావన్(23) ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేసేందుకు విద్యుత్తు స్తంభం ఎక్కాడు. ఎల్‌సీ ఇచ్చిన సుబ్రహ్మణ్యంరెడ్డి షిఫ్ట్ మారడంతో రెండో ఆపరేటర్‌గా వచ్చిన సుధాకర్‌రాజు లైన్‌మెన్ జనార్ధన్‌రెడ్డి, ఆపరేటర్ సుబ్రహ్మణ్యంరెడ్డిని సంప్రదించకుండా విద్యుత్ చార్జ్ చేశారు. దీంతో ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేస్తున్న ధావన్‌కు షాక్ తగలడంతో కరెంట్ పోల్ పైనే కుప్పకూలాడు. అప్రమత్తమైన సిబ్బంది 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని మెరుగైన చికిత్స కోసం తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాధితుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. లైన్‌మెన్, ఆపరేటర్ల మధ్య సమన్వయ లోపమే ఈ ప్రమాదానికి కారణమని సూపర్‌వైజర్ మనోహర్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో లైన్‌మెన్ జనార్ధన్‌రెడ్డి, ఆపరేటర్లు సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధాకర్‌రాజులపై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.